## కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా పీహెచ్‌సీలో వైద్య సేవలు

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి షాలిని




ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సామాన్యుడికి కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వైద్యంతో పాటు వైద్య పరీక్షలు, మందుల వితరణ వంటివి ప్రైవేటుతో పోల్చితే అన్ని విధాలుగా ఇక్కడే బాగుంటాయి. గర్భస్త, ప్రసూతి వంటి వైద్య సేవలతో పాటు ఓ.పీ, ప్రథమ చికిత్సకు అల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రెండు దశాబ్దాలుగా పేరు గాంచింది. గురువారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా. షాలిని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

- అల్లాపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి)

**మీరు పర్వత్‌నగర్ పీహెచ్‌సీకి ఎప్పుడొచ్చారు?**

రెండేళ్లుగా వైద్య శాఖలో సేవలందిస్తున్నా. ఇక్కడికొచ్చి ఏడాది కావొస్తోంది.

**నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతాయి?**

గత నెల 12 డెలివరీలు చేశాం. సగటున నెలకు 15 జరుగుతాయి.

**మెటర్నిటీ వైద్యంతో పాటు ఎలాంటి సేవల ఉంటాయి?**

సామాన్య ఓ.పీ.(ఔట్ పేషంట్) చికిత్సలు నిర్వహిస్తాం. పలు రకాల నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు (ఎన్‌సీడీ బీపీ, షుగరు లాంటివి) మందుల వితరణ అందిస్తాం.

**ఓపీ వేళలు ఎంతవరకు ఉంటాయి.**

ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూస్తాం. ఏదేని అత్యవసర పరిస్థితులు ఉంటే మిగతా వేళల్లో కూడా సేవలు అందిస్తాం.

**గర్భస్త మహిళలకు, బాలింతలకు, శిశువులకు ఎలాంటి వైద్య సదుపాయాలున్నాయి?**

బాలింతలకు కావాల్సిన పోషణ, చెక్-అప్‌లు వంటివి అందిస్తాం. శిశువులకు వారి వయసును బట్టి టీకాలు కూడా ఇస్తున్నాం.

**కుక్క కాటు వేస్తే ఇంజెక్షన్ ఉందా?**

గతంలో కుక్క కాటుకు మందుకోసం నారాయణగూడకు వెళ్లేవారు. ఇప్పుడా అవసరం లేదు. నిత్యం ఇక్కడే ఏడు నుంచి ఎనిమిది కుక్కకాటు బాధితులు వస్తున్నారు.

**ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది తగ్గారా?**

ల్యాబ్ టెక్నీషియన్ రెగ్యులరైజ్ అవడంతో బదిలీ చేశారు. త్వరలో ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

**ఒకే ఒక్క వైద్య అధికారి ఉన్నారు ఎందుకని?**

యూపీహెచ్‌సీ పర్వత్‌నగర్‌లో రెండు పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అవసరాలకు ఒక వైద్య అధికారితో సర్దుబాటు చేస్తున్నాం. పేషంట్ల ఆదరణతో రెండో ఎం.ఓ. కూడా తదనుగుణంగా నియమిస్తారు.

## 'డీహెచ్‌పీఎస్ మహాసభలను విజయవంతం చేయాలి'

హైదర్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జనవరి 5,6,7వ తేదీల్లో నిర్వహించనున్న (డీహెచ్‌పీఎస్) జాతీయ 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు గురువారం కూకట్‌పల్లిలోని సీపీఐ కార్యాలయంలో గురువారం మండల కార్యదర్శి జి.కృష్ణ ఆధ్వర్యంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.బాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశంలో మహిళలు, దళితులు, చిన్నారులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ అధికారంలో ఎన్న మణిపూర్ రాష్ట్రంలో నిత్యం ఒకరిపై ఒకరు దాడులు జరుగుతున్నా ప్రధాని మోదీ స్పందించక పోవడం దారుణమన్నారు. కేంద్రంలో కూడా అధికారంలో ఉన్న బీజేపీ మణిపూర్‌లో హింసను అదుపు చేయలేని పరిస్థితుల్లో ఉండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు దావీద్, చంద్రమ్మ, లక్ష్మి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వంటశాల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



షెడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి

ఫతేనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్‌లోని హరిహరాక్షేత్ర ఆలయం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. గురువారం ఆలయ ప్రాంగణంలో వంటశాల నిమిత్తమై చేపడుతున్న షెడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకుడు పాల్గొన్నారు.

# పేక మేడలు భద్రమేనా?

- సిద్ధిఖ్‌నగర్ ఘటన తర్వాతైనా మార్పు వస్తుందా?
- ప్రమాదం పొంచి ఉన్నా.. పట్టించుకోని అధికారులు
- 66 గజాల్లో 7 స్లాబ్‌లు.. 88 గజాల్లో 8 స్లాబ్‌లు!



కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లోని ఎల్‌ఐజీ ఫ్లాట్ నంబర్ 475

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేక మేడలను చూస్తేనే భయమేస్తోంది.. పైకి ఎక్కి కిందకు చూసినా కళ్లు తిరగడం కాయం. కేపీహెచ్‌బీ మూడోరోడ్డులోని గల్లీల్లో 66గజాల్లో ఏడు స్లాబ్‌లు.. ఏడోఫేజ్‌లోని ఎల్ఐజీ 88 గజాల్లో ఎనిమిది స్లాబ్‌లు వేడయం ఇటీవల పరిపాటిగా మారిందని చెప్పొచ్చు. వీటి నిర్మాణం అంతా మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లో జరగడంతో వీటివైపు కన్నెత్తికూడా చూడలేకపోతున్నారు. తాజాగా గచ్చిబౌలి సిద్ధిఖ్‌నగర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిన యంత్రాంగం, ఆమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు అందిన కాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంథా మార్చుకొని ప్రజల కోసం పనిచేయాల్సిన అవసరం ఉంది.

### ప్రజల గోస ఆలకించేవారేరి?

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలో నో ప్రాఫిట్.. నోలాస్ ప్రాతిపదికన పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చిన ఏపీహెచ్‌బీ నేడు టీజీహెచ్‌బీ కనమరుగవుతోంది. హాస్టల్స్ కోసం గల్లీల్లో ఉండే 66, 88 గజాల్లో ఆరు, ఏడు ఫ్లోర్లు నిర్మిస్తూ ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ఉండే నివాసితుల పరిస్థితి ఏంటి ? అత్యవసరం అయితే అంబులెన్స్ కూడా ఆ గల్లీలోకి వెళ్లలేని పరిస్థితి. మాకు హాస్టల్స్ వద్దు.. మీరు మమ్మల్ని ఇబ్బంది పెట్టొదని ఓనర్స్‌ను సైతం బ్రతిమిలాడడం, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకునే వారే లేరు. దీంతో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఉన్న ప్రాంతాన్ని విడిచిపెట్టి వేరే చోటకు వెళ్లలేక.. ఉన్న దాంట్లో ఉంటే గల్లీల్లో టూవీలర్స్ పార్కింగ్‌తో నడవడానికి కూడా వీల్లేకుండా అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడంతో వారి సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మథనపడుతున్నారు.

### కొత్త వాటినైనా ఆపకపతే ఎలా ?

నిర్మించేటప్పుడే స్లాబ్‌లు కూలిపోతున్నాయి. పక్కస్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేటప్పుడు ఒరిగిపోతున్నాయి. ఇవన్నీ అధికారులకు తెలియదా అంటే అంతా తెలుసు అనే



కేపీహెచ్‌బీ మూడో రోడ్డులోని ఓ గల్లీలో ఈడబ్ల్యూఎస్ ఫ్లాట్ నంబర్ 983


అంటారు. కానీ అవినీతి, ఆమ్యామ్యాలకు అలవాటు పడిన యంత్రాంగం క్షేత్రస్థాయిలో అడ్డుకట్ట వేస్తే రావాల్సిన పైసలు ఎలా వస్తాయనే దానిపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఇప్పటికే నిర్మించిన భవనాలకు భద్రతపై సూచనలు చేస్తూ కొత్త వాటిని ఆపకపోతే భవిష్యత్తులో జరుగనున్న ప్రమాదాలకు కారకులు ఎవర్ని చేయాలి. ఇప్పటికైనా పైసల కోసం కాకుండా ప్రజల కోసం ఆలోచిస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చు.

### నాడు మేస్త్రీలే నేడు బిల్డర్లు..!

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా పేక మేడలను ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారు. కొందరు జీ ప్లస్ ఒకటి, రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఆరు, ఏడు, ఎనిమిది స్లాబ్‌లు వేస్తూ ఇంజనీర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. నాలుగు, అయిదు సంవత్సరాల పాటు తాపీ మేస్త్రీలుగా పనిచేసిన వారే నేడు బిల్డర్లుగా చెప్పుకుంటూ పేక మేడలు నిర్మిస్తూ ఆర్కిటెక్చర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. ఏదైనా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే దానికి సంబంధించి ఓ ప్లాన్ ఉండాలి. అపార్ట్‌మెంట్లు నిర్మించే వారు అయితే ఆర్కిటెక్చర్‌ను సంప్రదించి వారి సూచనల మేరకు నిర్మాణం చేపడతారు. కానీ ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీల్లో నిర్మించే పేక మేడలకు ఇలాంటివేమీ అవసరం ఉండదు. మేం మస్తుగా కట్టాం. మీరే ఏం భయపడొద్దు.. అంటూ మొన్నటి వరకు మేస్త్రీలుగా పనిచేసిన వారు బిల్డర్ అని చెప్పుకుంటూ గంప గుత్తగా తీసుకొని పేక మేడకలను నిర్మించడం కేపీహెచ్‌బీలో సర్వసాధారణమైంది.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ.45, బెండకాయ రూ.35, పచ్చి మిర్చి రూ. 30, బజ్జి మిర్చి రూ.40, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.32, క్యాబేజీ రూ. 26, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.55, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.32, చిక్కుడు కాయ రూ.50, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.50, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.36, కీర రూ.13, దోసకాయ రూ.28, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.50, ఉల్లిపొరక రూ.45, ఉల్లిగడ్డ రూ.49, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడదుంప రూ.28, గుమ్మడికాయ రూ.18, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.14-16, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



# పర్యాటకులకు గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు

- ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్ ప్యాకేజీలను ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 80మంది విలాసవంతంగా ప్రయాణించేందుకు అనువుగా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్ బెడ్‌డ్ క్యాబిన్‌లతో పాటు అత్యంత ఆధునిక వసతి సౌకర్యాలతో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. అన్నిరకాల చానెళ్లు తిలకించేందుకు టీవీలను సైతం క్యాబిన్‌లో ఏర్పాటు చేసింది. వినోదం, విశ్రాంతి కోసం లగ్జరీ రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీలను ఆస్వాదించేందుకు ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. అలాగే రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఇందులో స్థానిక రుచికరమైన వంటకాలతో పాటు మద్యం ప్రియులకు అవసరమైన రకరకాల పానీయాలను సైతం ఇక్కడి బార్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు. అలాగే జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. గోల్డెన్ చారియెట్ లగ్జరీ రైలు డిసెంబర్ 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబర్ 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, టూర్ ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపాశారు. మరిన్ని వివరాలకు 91 8585931021, లేదా వెబ్‌సైట్www. goldenchariot.org, Email: goldenchariot@irctc.com సంప్రదించాలని రైల్వే అధికారులు తెలిపారు.



గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలులో రెస్టారెంట్

## నిర్మలా జగ్గారెడ్డికి వినతి



టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు

బాలానగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమెను కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కోసం కేటాయించిన స్థలాన్ని వెంటనే అభివృద్ధి చేసి పరిశ్రమ నిర్వాహకులకు అందుబాటులోకి తేవాలని ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి అలెక్స్, ఉపాధ్యక్షుడు బీవీవీ. బాలాజీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజూ నాయక్ పాల్గొన్నారు.

## వనభోజనాలు



కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ గురువారం ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమానికి కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరై నిర్వాహకులను అభినందించారు. కార్తీకమాసంలో వనభోజనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, పెద్దలు అందరూ కుటుంబ సమేతంగా కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)

## అయ్యప్ప క్షేత్రంలో ఉదయ పూజలు



పూజలో పాల్గొన్న గురుస్వాములు, భక్తులు

ఫతేనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్‌లోని అయ్యప్ప క్షేత్రంలో ఉదయ పూజలు గురువారం ఘనంగా జరిగాయి. విష్ణు నంబూద్రి మహేష్, శివ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు భిక్ష, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో తూము ప్రవీణ్‌పటేల్, నరేందర్‌పటేల్, గురుస్వామి సత్తయ్య, వానిరెడ్డి బాలు, సురేశ్‌స్వామి, సప్పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తులకు భిక్ష

హైదర్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయం కమిటీ ఆలయంలో అయ్యప్ప మాలాధారణ భక్తులకు ఈనెల 21నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు రోజూ భిక్ష ఏర్పాటు చేస్తున్నట్టు గురుస్వామి గడ్డం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు అయ్యప్ప మాలాధరణ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భిక్ష చేశారు. కార్యక్రమంలో స్థానికులు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, రమేష్‌యాదవ్, చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## దుప్పట్ల పంపిణీ

బాలానగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న సత్యసాయి జయంతిని పురస్కరించుకొని బాలానగర్ సాయినగర్ సాయినాగేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయి జయంతి వేడుకలు ఈనెల 23 వరకు ఉంటాయని సునిల్ తెలిపారు.

### వైద్య పరీక్షలు

సాయినాగేంద్ర ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు అంబటి సునీల్ తెలిపారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డా. సత్యనారాయణ స్వామి భక్తులకు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ప్రతీ నెల రెండో గురువారం ఉదయం 8 గంటల నుంచి11 గంటల వరకు వైద్య సేవలను భక్తులు ఉపయోగించుకోవచ్చని ఆయన భక్తులకు సూచించారు.

## ఆర్ఆర్‌బీ పరీక్షల కోసం 42 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 25నుంచి 29వ తేదీల మధ్య జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలియజేశారు. నవంబరు 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్ (07101), 24, 25, 26, 28వ తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు(07102), కరీంనగర్- కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్(07104), 23న నాందేడ్- తిరుపతి(07105), 24న తిరుపతి- నాందేడ్(07106), 24, 26, 28, 29వ తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి(07107), తిరుపతి- కాకినాడ టౌన్(07108) 24, 25, 26వ తేదీల్లో కాచిగూడ- కర్నూల్ సిటీ(07109), కర్నూల్ సిటీ- కాచిగూడ(07110), 24, 25, 26,27వ తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28వ తేదీల్లో కర్నూల్ సిటీ- హుబ్లీ (07316) ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

## సికింద్రాబాద్-వాడిల మధ్య 4 లైన్‌ల ట్రాక్ కోసం స్థల సేకరణ

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య నాలుగు లైన్‌లుగా విస్తరించే పనులు చేపట్టడానికి అవసరమైన స్థలాన్ని సేకరించే పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. ప్రధానంగా సనత్‌నగర్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య సుమారు 173.18 కిమీ దూరం భవిష్యత్ అవసరాలకు మూడు నుంచి నాలుగు లైన్‌ల ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టడానికి అనుమతించింది. ఈ మేరకు తెలంగాణలోని హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని కలబురిగి జిల్లాల్లో ప్రతిపాదించిన భూమిని ఆయా జిల్లా కలెక్టర్‌ల సహకారంతో సేకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## నేడు ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ఆధ్వర్యంలో శుక్రవారం యూసఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్ మే)లో ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు అందజేస్తున్నారు. ఏపీమాస్ 23ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా మహిళా సాధికారత సాధన, పేదరికం తగ్గుదల కోసం కృషి చేస్తుందని నిర్వాహకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జరుగనున్న కార్యక్రమానికి దేశంలోని 22రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయ సంఘాల ప్రతినిధులు, అభివృద్ధిరంగ నిపుణులు, బ్యాంకర్లు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని వారు తెలిపారు.

## 'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

- యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు టీజీ న్యాబ్ అవగాహనా కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. అందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో వచ్చే వారం రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు నవంబరు 27, 28న రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల్ని కూకటివేళ్లతో నిర్మూలించేందుకు ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు.

## నత్తనడకన కులగణన సర్వే

బాలానగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలానగర్ 120డివిజన్‌లో కులగణన సర్వే నత్తనడకన సాగుతోంది. సర్వేపై అధికారులు, ఇన్‌చార్జీలు, సిబ్బందికి ఏకాగ్రత లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ సర్వే జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వేకు సంబంధించిన వివరాలు తెలుసుకుందామనుకుంటే రిపోర్టు తీసుకుంటున్న ఎన్యుమరేటర్లు ఎక్కడ ఉన్నారో కానారావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయంపై సంబంధిత టీఐ వినోద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇంత వరకు ఎన్ని ఇళ్లను సర్వే చేశారు.. ఎంత మంది సిబ్బంది సర్వే చేస్తున్నారు.. వారి వివరాలు తెలపాలని ఆయనను కోరగా తనకేమీ తెలియదని, జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులకే తెలుసని చేతులెత్తేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్ సెక్షన్ పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు గోకుల్ ప్లాట్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదు.

### అల్లాపూర్‌లో...

- అల్లాపూర్: ఎల్‌సీ నిర్వహణా పనుల కారణంగా శుక్రవారం అల్లాపూర్‌లోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ అయ్యప్ప సొసైటీ పరిధిలోని రామరాజు గెస్ట్ హౌజ్, సర్వే-ఆఫ్-ఇండియా కాలనీ రోడ్ నెం.45 నుంచి రోడ్ నెం.55 వరకు ఉన్న ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

## బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్
- బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంతపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకిబోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి చేయగా, ఇది ఎనమిదో విచరాణ అని తెలిపారు. ఈనెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బీసీ కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు.




మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

# వదిలేది అరగంట.. తీరేదెలా నీటి తంటా

**ఇంద్రన్న కాలనీలో తాగునీటికి కటకట**

- తక్కువ ప్రెషర్‌తో నీటి సరఫరా
- పట్టించుకోని వాటర్‌వర్క్స్ అధికారులు
- ట్యాంకర్లపై ఆధారపడ్డ కాలనీవాసులు

**నిజాంపేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ ఇంద్రన్నకాలనీలో తాగునీరు సరిపోవడం లేదని కాలనీ వాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 33వ డివిజన్‌లో దాదాపు 280 నివాసాలుండగా, సుమారుగా వెయ్యిమంది వరకు జనాభా నివసిస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు సరిపోక ట్యాంకర్ నీటిపైనే ఆధార పడుతున్నారు. ఈ కాలనీలో తాగునీటి పైప్‌లైన్లు వేయకముందు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అప్పట్లో నివాసాలు తక్కువగా ఉండటం వల్ల ఆ ట్యాంకర్ల నీటితోనే కాలం గడిచేది. ఆ తరవాత కాలనీ వాసులు మంజీరా తాగునీటి కనెక్షన్లు తీసుకున్నారు. వాటర్ బిల్లు కూడా రెండు వందల నుంచి రెండు వందల యాభై వరకు వస్తుండేది. కానీ రాను, రాను నీటి బిల్లులు రూ.355లకు పెరిగింది. ఇదిలా ఉంటే రెండు రోజులకొకసారి అరగంట మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు.


నీటి సమస్య వల్ల అందుబాటులో ఉంచిన డ్రమ్ములు

ఈ సమయంలో కిందిభాగంలో ఉన్న ఇళ్లకు ఎక్కువ ప్రెషర్, పైభాగంలో ఉన్న వారికి తక్కువ ప్రెషర్‌తో తాగునీరు వస్తోంది. ఇచ్చేది రోజు విడిచి రోజు, కానీ వదిలేది అరగంట మాత్రమే. అది కూడా తక్కువ ప్రెషర్ వస్తుంది. కేవలం నాలుగు బిందెలు నీళ్ల పట్టుకోగానే సరఫరా ఆగిపోతుంది. ఇలాంటి సమస్యలతో తాము విధిలేని పరిస్థితుల్లో ట్యాంకర్‌కు ఏడు వందల రూపాయల చొప్పున చెల్లించి బోరునీరు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇదే విషయమై వాటర్‌వర్క్స్ అధికారులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందజేశామని తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తామంటున్నారే తప్ప ఇంత వరకు అతీ, గతీ లేదు. ఈ విషయంలో వాటర్‌వర్క్స్ అధికారులు కనీసం మా విన్నపాలను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాతో పాటు, నీటి ప్రెషర్ కూడా పెంచితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.



కాలనీకి నీటిని తరలిస్తున్న ట్యాంకర్

**నీటిని కొనుగోలు చేస్తున్నాం**



రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్న అధికారులు, సిబ్బంది నీటి ప్రెషర్‌ను పెంచడం లేదు. దీని వలన అరగంట వచ్చే నీరు మాకు ఏమాత్రం సరిపోవడం లేదు. నీరు సరిపోకపోవడం వల్ల ట్యాంకర్ ద్వారా బోరు నీటిని రూ.7వందలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు నీటి ప్రెషర్ పెంచేవిధంగా చూసి, రెండు రోజులకు ఒక్కసారి విడిచే నీటిని ఒక గంట పాటు విడిస్తే బాగుంటుంది.

- అలివేలు, ఇంద్రన్నకాలనీ

**తాగునీరు సరిపోవడం లేదు**



గతంలో రూ. 2 వందలు బిల్లు, కొద్ది మాసాలుగా రూ.355కి పెంచారు. తాగునీటి సరఫరా మాత్రం పెంచడం లేదు. రెండు రోజులకు ఒక్కసారి అరగంట మాత్రమే వదులుతున్నారు. తాగునీరు ఏ మాత్రం సరిపోవడంలేదు. గతంలో బిల్లు కట్టమని సెల్‌ఫోన్‌కు మేసేజ్ పంపేవారు. కానీ ఇప్పుడు సిబ్బంది బిల్లులు ఇచ్చిపోతున్నారు. కానీ నీటి సరఫరా మాత్రం పెరగడం లేదు. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్న మాకు నీటి సరఫరాను కూడా పెంచాలి.

- మోహన్‌రెడ్డి, ఇంద్రన్నకాలనీ

## ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషిచేస్తా


జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్

- ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** ముదిరాజ్‌ల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, బలరాం, నదీమ్‌రాయ్, విజయ్,హరీష్,గుమ్మల స్వామి, కోలారవీందర్, గుమ్మడి మధుసూదన్‌రాజు, ఉమారాణి పాల్గొన్నారు.

**పెండింగ్ పనులు చేయాలి**

ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో గాజులరామారం డీసీ మల్లారెడ్డి, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో వేర్వేరుగా ఆయన సమావేశమయ్యారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వక్ఫ్, దేవాదాయ శాఖల పేరు చెప్పి అనుమతులు ఇవ్వకుండా దరఖాస్తుదారులను ఇబ్బందికి గురిచేయడం పద్ధతి కాదన్నారు.

కోర్టు ఆదేశాలను పాటించాలని సూచించారు. అదేవిధంగా వివిధ కాలనీలలో నిర్మాణదశలో, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని డీఈ శిరీషకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు కళ్యాణ్, తిరుపతి, ఏసీపీ రమేష్, టీపీఎస్ తుజ్జాసింగ్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

**నిజాంపేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ఈ అక్రమ నిర్మాణాలను నిలిపి వేసి, తగిన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీకి సీపీఐ నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. దీనిపై బాచుపల్లి సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. జీ+2 అనుమతులు తీసుకొని నాలుగైదు అంతస్తులను నిర్మిస్తున్నారు. వీటికి తోడు సర్వే నంబరు 90, 94లో కూడా ఇలాంటి నిర్మాణాలు చాలా జరుగుతున్నాయి. వీటిపై గతంలో తాము ఫిర్యాదు చేసినా, అప్పుడున్న టౌన్ ప్లానింగ్ అధికారి స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పుడు అదే రీతిలో నిర్మాణదారులు రోడ్డును కూడా వదలకుండా ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. ప్రగతినగర్ సాయి కీర్తి లే-అవుట్ అనుకొని ఉన్న రోడ్డును పూర్తిగా ఆక్రమించారని, దీనిపై కూడా అధికారులకు తాము ఫిర్యాదు చేశామన్నారు. ఇక్కడ అధికారులు తరచూ బదిలీలపై వెళ్లిపోతుండటం కబ్జాదారులకు వరంలా మారిందన్నారు. వీటిపై సరైన దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆశియాదయ్య, చంద్ర మోహన్ ఉన్నారు.

## బైకు అదుపుతప్పి యువకుడు మృతి


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

**దుండిగల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):** పాలకుర్తి మండలం, సముద్రాల గ్రామానికి చెందిన బి. దేవేందర్‌రెడ్డి, శ్రీలత గత 25 సంవత్సరాల క్రితం దుండిగల్ ప్రాంతానికి వచ్చి, సారేగూడెం పరిధిలోని, మాధవరావు కాలనీలో స్థిరపడ్డారు. ఆయన కుమారుడు బి. చంద్రశేఖర్ రెడ్డి (24) శామీర్‌పేట్ ప్రాంతంలోని ఫార్మసీ పరిశ్రమకు సర్వీస్ ప్రొవైడర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్లిన అతడు, బుధవారం సాయంత్రం 8 గంటల సమయంలో దుండిగల్ అవుటర్ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు దగ్గర రైతులు ఆరబోసిన వడ్ల మీద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తల పగిలి ప్రాణాలు కోల్పోయాడు. 8.30 గంటల సమయంలో దుండిగల్ మొబైల్ పోలీసులు గమనించి, మృతుని దగ్గర లభించిన ఆధారాలను బట్టి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయమై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీసులు గురువారం మృత దేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## హెచ్ఎంటీ కాలనీలో ఉర్సు


ఉత్సవంలో పాల్గొన్న కేఎం ప్రతాప్

**జీడిమెట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలో హజరత్ జిందాషా మదర్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హజరత్ జిందాషా మాదర్ రహమతుల్లా ఆలే ఉర్సు ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.ఎం.ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, రియాజ్, అబ్దుల్ ఖాదర్, షేక్ బాబుమియా, జలీల్‌ఖాన్, గౌస్, ఎం.డీ.షాకీర్, అన్సర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తిని కలిగించాలి : డీసీపీ


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

**జీడిమెట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఒకరికి విద్యనందిస్తే మూడు తరాలకు మేలు జరుగుతుందని, పిల్లల్లో విద్య నేర్చుకునే తపనను పెంచాలని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఐపీఎస్ అన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిక్కులబస్తీలో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 20మంది పేద విద్యార్థులకు అక్షయ ఫౌండేషన్ ద్వారా ల్యాప్‌టాప్‌లను డీసీపీ సురేష్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా అక్షయ ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జగద్గిరిగుట్ట సీఐ కె.నర్సింహ, అక్షయ విద్య చైర్మన్, ఫౌండర్ టింటు ప్రసాద్, జోనల్ మేనేజర్ సాయినాథ్, రాజశేఖర్, విజయకుమార్, సఫీయా, సోనం, గుర్మీత్, మహిన్, దర్శన్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకేచెకుముకి సంబరాలు


చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**నిజాంపేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** జన విజ్ఞాన వేదిక బాచుపల్లి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రగతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. ఈ సంబరాల్లో బాచుపల్లి, దుండిగల్ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజా, ప్రగతి జూనియర్ కళాశాల కో-ఆర్డినేట్ నరేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య, జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు లక్ష్మీనర్సయ్య హాజరయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు ఈ సంబరాలు ఉపయోగపడతాయని అతిథులు అన్నారు. జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు నవంబరు 28న కుత్బుల్లాపూర్ మండలం వేదికగా జరుగుతుందని, మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల నుంచి విద్యార్థులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు శంకరరావు, అమీర్ బాషా ఉన్నారు.

## 'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

- యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు టీజీ న్యాబ్ అవగాహన కార్యక్రమాలు

**హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):** గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. అందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో వచ్చే వారం రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు నవంబరు 27, 28న రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల్ని కూకటివేళ్లతో నిర్మూలించేందుకు ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు.

## యాంటీ ర్యాగింగ్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

- మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

**గాజులరామారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ మెడికల్ సైన్స్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ రూల్స్‌పై మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి సూరారం సీఐ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.సీనియర్లు జూనియర్లపై ర్యాంగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకొని, రిమాండ్‌కు తరలిస్తారని, విద్యార్థులు చదువుకొని సమాజంలో మంచిస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీ.వీ.శాస్త్రి, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, అడ్మిన్ ఎస్‌ఐ చింతకాయల వెంకటేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్‌బీ పరీక్షల కోసం 42 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 25 నుంచి 29వ తేదీల మధ్య జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలియజేశారు. నవంబరు 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్ (07101), 24, 25, 26, 28వ తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు (07102), కరీంనగర్- కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్ (07104), 23న నాందేడ్- తిరుపతి (07105), 24న తిరుపతి- నాందేడ్ (07106), 24, 26, 28, 29వ తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి (07107), తిరుపతి- కాకినాడ టౌన్ (07108) 24, 25, 26వ తేదీల్లో కాచిగూడ- కర్నూల్ సిటీ (07109), కర్నూల్ సిటీ- కాచిగూడ (07110), 24, 25, 26, 27వ తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28వ తేదీల్లో కర్నూల్ సిటీ- హుబ్లీ (07316) ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

## డ్రైవర్లకు ఉచిత కంటివైద్య శిబిరం

- ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో టాటా గ్రూప్ సంస్థ అయిన టైటాన్ ఐ ప్లస్, హెచ్‌జీటీఏ సహకారంతో ఔటర్ టోల్ వసూళ్ల ఏజెన్సీ ఐఆర్‌బీ సంస్థ గురువారం నిర్వహించింది. వాహనదారులకు కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను అందించారు. శనివారం వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లు సరిగా కనిపించనప్పుడు కళ్లజోడు పెట్టుకోవడానికి మొహమాటపడకూడదని తెలిపారు. కళ్లద్దాలతో సరిపోక అంతకంటే ఎక్కువగా ఎవరికైనా శుక్లాలు ఏర్పడితే వాటికి ఆపరేషన్లు చేయించడానికి కూడా ఇక్కడి నుంచి రిఫర్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్‌శర్మ, హెచ్‌జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, ఐఆర్‌బీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలి : బీజేపీ

**దుండిగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ మండలం, పేట్ బషీరాబాద్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 25(1, 2)ల్లో 428 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం నిషేధిత జాబితాలో మాత్రం 254 ఎకరాల రికార్డులో చూపిస్తోంది. సర్వే నంబరు 25/2లో పోలీస్‌స్టేషన్, స్కూల్, జర్నలిస్టు సంఘాలకు కేటాయించిన భూమి ఉంది. ఈ స్థలం జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో కోట్లాది రూపాయలు విలువ చేస్తుంది. ఈ విలువైన భూమిని రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలతో గత 10 సంవత్సరాల వ్యవధిలో కొందరు భూ బకాసురులు 80 శాతం కబ్జాకు వరకు పాల్పడ్డారని, ఈ విషయమై అధికారులు సమగ్ర విచారణ జరిపి ఆ భూమిని కాపాడాలని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్, నల్లా జయశంకర్, ఎం.అరుణ్‌రావులు గురువారం మల్కాజ్‌గిరి ఆర్‌డీఓకు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

## హజరత్ జిందాషా మదర్ దర్గాలో ఉర్సు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129వ డివిజన్ షాపూర్‌నగర్ హజరత్ జిందాషా మదర్ దర్గాలో గురువారం 16వ ఉర్సూ ఉత్సవాలు చోటుబాబా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఉత్సవాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, నాయకులు వెంకటేష్, మధుసూధన్‌రెడ్డిలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

## బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ● బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

**రంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) :** సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంతపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకి బోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు.

ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి చేయగా, ఇది ఎనమిదో విచారణ అని తెలిపారు.

ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బీసీ కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

## చదువు కోసం దేవాలయ కమిటీ విరాళం



పాఠశాల యాజమాన్యానికి రూ.50 వేల చెక్కును అందిస్తున్న హరి

**నిజాంపేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ 191 ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పేద విద్యార్థిని వి.వైష్ణవి ఆర్థిక సమస్యలతో ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఆమె చదువుకు అయ్యే ఖర్చు రూ.50 వేలను భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రగతి విద్యాసంస్థలో విద్యనభసిస్తున్న వైష్ణవికి దేవాలయ కమిటీ సభ్యులు నల్లాది హరి చేతుల మీదుగా ఫీజులో భాగంగా రూ.50 వేల చెక్కును పాఠశాల యాజమాన్యానికి గురువారం అందించారు.

## పర్యాటకుల కోసం గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు

- ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్ ప్యాకేజీలను ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

**హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి):** విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 80మంది విలాసవంతంగా ప్రయాణించేందుకు అనువుగా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్ బెడెడ్ క్యాబిన్‌లతో పాటు అత్యంత ఆధునిక వసతి సౌకర్యాలతో ప్రత్యేక గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. అన్నిరకాల చానెళ్లు తిలకించేందుకు టీవీలను సైతం క్యాబిన్‌లో ఏర్పాటు చేసింది. వినోదం, విశ్రాంతి కోసం లగ్జరీ రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీలను ఆస్వాదించేందుకు ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. అలాగే రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో రుచికరమైన వంటకాలతో పాటు మద్యం ప్రియులకు రకరకాల పానీయాలను ఇక్కడి బార్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు. అలాగే జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. గోల్డెన్ చారియెట్ లగ్జరీ రైలు డిసెంబర్ 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబర్ 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, టూర్ ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు,వివరాలకు 91 8585931021, లేదా వెబ్‌సైట్ www.goldenchariot.org, Email: goldenchariot@irctc.com సంప్రదించాలని అధికారులు తెలిపారు.


గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలులో రెస్టారెంట్



అధికారులతో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సాదుపాయాలు కల్పిస్తున్నామని కార్పొరేటర్ రోజాదేవి అన్నారు. గురువారం వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లిఎన్‌క్లేవ్ బస్‌స్టేషన్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంకువరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్, హెచ్ఎండబ్ల్యుఎస్, జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ అమీరుద్దీన్, విద్యుత్ ఏఈ పిరునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యం, బాలకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, విక్రమ్, ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అసోసియేషన్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

## మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

● కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, సోఫాకాలనీకి చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను పరిష్కరించాలి, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు, యూజీడీ పనులు పూర్తి చేయాలని, మంచినీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీల వాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

● బీజేవైఎం నాయకులు

మియాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లో రాష్ట్ర విద్యాబోర్డు నుంచి అనుమతులు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తు తరగతులు నిర్వహిస్తున్న మోషన్ హైదరాబాద్ ఫోర్కెస్కూల్‌పై బీజేవైఎం నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎంఈవో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేవైఎం నాయకులు సాయిరాంగౌడ్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదీనగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిరంజీవినగర్, అమన్‌కాలనీ, టీఎన్‌నగర్, కేజీఆర్ టవర్స్ ఎఫ్‌సీఐ కాలనీ, టాకిటౌన్ థియేటర్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయదుర్గం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోమరంభీం 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. టీఎన్‌జీఓ కాలనీ, సెక్రటేరియేట్ కాలనీలో విద్యుత్ ఉండదని తెలిపారు.



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో టాటా గ్రూప్ సంస్థ అయిన టైటాన్ ఐ ప్లస్, హెచ్‌జీటీఏ సహకారంతో ఔటర్ టోల్ వసూళ్ల ఏజెన్సీ ఐఆర్‌బీ సంస్థ గురువారం నిర్వహించింది. వాహనదారులకు కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను అందించారు. శనివారం వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లు సరిగా కనిపించని వారికి ఆపరేషన్లు చేయించడానికి రిఫర్ చేస్తారని తెలిపారు. ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్‌శర్మ, హెచ్‌జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, ఐఆర్‌బీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

చందానగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న (50) చందానగర్ హుడాకాలనీ రమణరెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 17న ఉద యం ఇంట్లో భార్యలేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైన ఆచూకీ తెలిస్తే 8712566921 సమాచారం అందించాలని కోరారు.



వెంకన్న

# చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

● దుర్వాసన.. దోమల బెడదతో ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు



గచ్చిబౌలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ శాఖలో కొన్నాళ్లుగా అధికారి లేడు. గతంలో ఉన్న ఔట్ సోర్సింగ్ అధికారి కిరణ్ రాజీనామ చేసి వెళ్లిపోవడంతో ఆ స్థానంలో ఎవరిని నియమించలేదు. ఫలితంగా ఎంటమాలజీ శాఖలో పనిచేస్తున్న సుమారు 150 మంది కార్మికులు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. శేరిలింగంపల్లిలోని పాపిరెడ్డికాలనీ, నెహ్రూనగర్, గోపినగర్, వెంకటరెడ్డికాలనీ, లింగంపల్లి పాతగ్రామం, దూబేకాలనీ, నేతాజీనగర్, తారానగర్, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో దోమల విజృంభిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణకు ఎంటమాలజీలో పనిచేసే కార్మికులు ఫాగింగ్, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గోపిచెరువు, చాకలివాని కుంట చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోవడం, పరిసర కాలనీల నుంచి మురుగు, డ్రైనేజీ నీరు చెరువుల్లో కలవడంతో దుర్వాసనతో పాటు దోమలకు కూడా వృద్ధి చెందుతున్నాయి. గోపిచెరువు, చాకలివాని కుంటలో పూర్తిగా నిండి పోయిన గుర్రపుడెక్కను రెండు నెలల క్రితం తొలగింపు పనులు ప్రారంభించి పది రోజుల పాటు పనులు చేసి చెరువు గట్టుపై గర్రపుడెక్కను వేశారు. పూర్తిగా తీయకుండా మధ్యలో వదిలేశారు. తీసిన గుర్రపు డెక్క తిరిగి చెరువులో పడిపోయింది. అధికారులు లక్షలు ఖర్చుచేసి పనులు చేసినా తొలగించిన గుర్రపు డెక్కను తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రజాప్రతినిధులు ఇటువైపు వచ్చిన దాఖలాలు కనిపించలేదు.

### దోమలు.. దుర్వాసన

గోపిచెరువు, చాకలివానికుంట సమీపంలో ఉన్న కాలనీలు, బస్తీలు గోపినగర్, పాపిరెడ్డికాలనీ, నెహ్రూనగర్, రాజీవ్ స్వగృహ, గృహకల్ప వాసులు దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనకు కారణం డ్రైనేజీ నీరు నేరుగా చెరువులో కలవడం. దోమలు స్వైరవిహారంతో సాయంత్రం సమయంలో ఇంటి బయట నిలబడే పరిస్థితి లేదు. పలుమార్లు జీహెచ్ఎంసీ ఉపకమిషనర్, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఈ ప్రాంత వాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క (ఫైల్)

### పనులు చేపట్టి పూర్తి చేయాలి



గోపిచెరువు, చాకలివాని కుంటలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలి. తీసిన గుర్రపు డెక్కను తరలించినప్పుడే సమస్యకు కొంత వరకు పరిష్కారం అవుతుంది. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకున్నప్పుడే ఈ ప్రాంత వాసులకు దుర్వాసన, దోమల బెడద ఉండదు.

-ఎల్లేశ్, లింగంపల్లి

### త్వరలోనే గుర్రపుడెక్కను తొలగిస్తాం

ఈ ప్రాంతంలో దోమల బెడద, గుర్రపు డెక్క విషయం మా దృష్టికి వచ్చింది. తాను ఇటీవల ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. కాంట్రాక్టర్ సమయం పూర్తయింది. రెన్యూవల్‌కు పెట్టాము. త్వరలోనే గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టి పూర్తిగా తొలగిస్తాం. మురుగునీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకుంటాం.

- విజయ్‌భూపతిరావు, ఏఎంహెచ్ఓ

## నాలా పనులను వేగంగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్/రాయదుర్గం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదనీరు కాలనీలను ముంచేస్తుందని ఆ సమస్యను పరిష్కరించేందుకు నాలా విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆయన కొండాపూర్ డివిజన్ గఫూర్‌నగర్ కాలనీ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు, సైబర్‌హిల్స్ నుంచి జనార్దన్‌హిల్స్ వరకు రూ.25.41 కోట్ల వ్యయంతో చేపట్టబోయే నాలా విస్తరణ పనులు, మియాపూర్ గుర్నాథం చెరువు నుంచి పటేల్‌చెరువు వరకు చేపట్టబోయే నాలా విస్తరణ పనులను అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీరు సాఫీగా వెళ్లేలా నాలాల విస్తరణ పనులు చేపడుతున్నామని, దీంతో కాలనీ వాసులకు ముంపు సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. గఫూర్‌నగర్ కాలనీ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు ఆర్‌సీసీ బాక్స్‌నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని దీంతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.

మియాపూర్ గుర్నాథం చెరువు నుంచి పటేల్‌చెరువు వరకు నాలా విస్తరణ పనులు చేయడం జరుగుతుందని, ప్రతి వర్షాకాలం వరదనీరు కాలనీల్లో చేరుతుందని ఆ సమస్య కూడా పరిష్కారం అవుతుందన్నారు. నాలాల విస్తర్ణ పనులు వేగంగా రాబోయే వర్షాకాలం లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమం ఆగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీపడే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ ఆనంద్, ఏఈ జగదీశ్, కాంట్రాక్టర్ పీఎస్ రెడ్డి, స్థానికులు ప్రతాప్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులు

## ఘనంగా మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్

రాయదుర్గం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని టీహబ్‌లో 8వ మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్‌ను గురువారం నిర్వహించారు. మార్క్ మీడియా, ఇవాల్ స్కిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫ్యాషన్, జువెలరీ, ఇంటీరియర్స్, సస్టెయినబులిటీ, గేమింగ్, ఏఆర్, వీఆర్, హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. టీవర్క్స్ సీఈవో తనికెళ్ల జోగిందర్, మాథ టిహబ్ సీఈఓ రాహుల్ పైత్, టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాజ్ సావన్కర్ మాట్లాడుతూ సృజనాత్మకత, డిజైనింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించేందుకు ఈ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మన నిత్య జీవితంలోని పలు అంశాలకు సంబంధించిన డిజైనింగ్ చాలా ముఖ్యమన్నారు. ఈ సదస్సు ద్వారా అన్ని రంగాల డిజైనింగ్ నిపుణులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. డిజైన్ థింకింగ్ రంగానికి రాబోయే రోజులని, ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి దూరదృష్టితో తెలంగాణ మరోసారి ఈ రంగంలో ముందంజలో ఉండబోతుందని టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. విద్యా, సాఫ్‌వేర్, జువెలరీ, తదితర రంగాలకు చెందిన డిజైనింగ్ నిపుణులు ఇక్కడకు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు చెందిన నిపుణులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.




కాన్‌క్లేవ్‌లో సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

## బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

● రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

● బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంతపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకిబోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి చేయగా, ఇది ఎనమిదో విచరాణ అని తెలిపారు.

ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బీసీ కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు.




మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

## పర్యాటకుల కోసం గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు

● ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్ ప్యాకేజీలను ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 80 మంది విలాసవంతంగా ప్రయాణించేందుకు అనువుగా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్ బెడ్ క్యాబిన్‌లతో పాటు అత్యంత ఆధునిక వసతి సౌకర్యాలతో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. అన్నిరకాల చానెళ్లు తిలకించేందుకు టీవీలను సైతం క్యాబిన్‌లో ఏర్పాటు చేసింది. వినోదం, విశ్రాంతి కోసం లగ్జరీ రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీలను ఆస్వాధించేందుకు ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. అలాగే రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఇందులో స్థానిక రుచికరమైన వంటకాలతో పాటు మద్యం ప్రియులకు అవసరమైన రకరకాల పానీయాలను సైతం ఇక్కడి బార్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు.

అలాగే జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. గోల్డెన్ చారియెట్ లగ్జరీ రైలు డిసెంబర్ 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబర్ 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, టూర్ ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపాశారు. మరిన్ని వివరాలకు 91 8585931021 ఫోన్ సంప్రదించాలని రైల్వే అధికారులు తెలిపారు.



గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలులో రెస్టారెంట్

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్‌లో శుక్రవారం సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. బొల్లారం మెయిన్ రోడ్డు నుంచి బీకేఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ, ప్రజా షల్టర్స్ నుంచి మక్తా మహబూబ్‌పేట గ్రామం వరకు కలిపే లింకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



ఫొటో ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## ఇండియన్ ఫొటో ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని చిత్రమయి తెలంగాణ స్టేట్ ఫైన్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫొటో ఫెస్టివల్ (10వ ఎడిషన్)ను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన విద్యాసంస్థ ప్రతినిధులు

చందానగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చందానగర్ గంగారంలోని సుమన్ మహిళా దక్షిత సమితి విద్యా సంస్థల చైర్మన్ సరోజ్ బజాజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా దక్షిత సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా, వైద్య రంగాల్లో చేస్తున్న సేవలను గవర్నర్‌కు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక సమస్యలతో విద్యను మధ్యలో ఆపివేసిన వారిని చేరదీసి వారికి నచ్చిన కోర్సుల్లో చదివిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నిర్మల గోయాంక, ఉష, శకుంతల, ప్రీతిసంగి, సోని, అనిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ఆధ్వర్యంలో శుక్రవారం యూసఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్ మే)లో ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు అందజేస్తున్నారు. ఏపీమాస్ 23 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా మహిళా సాధికారత సాధన, పేదరికం తగ్గుదల కోసం కృషి చేస్తుందని నిర్వాహకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జరుగనున్న కార్యక్రమానికి దేశంలోని 22 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయ సంఘాల ప్రతినిధులు, అభివృద్ధిరంగ నిపుణులు, బ్యాంకర్లు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని వారు తెలిపారు.

## 'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. అందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో వచ్చే వారం రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు నవంబరు 27, 28న రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## ఆర్ఆర్‌బీ పరీక్షలకు 42 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 29వ తేదీల మధ్య జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలియజేశారు. నవంబరు 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్ (07101), 24, 25, 26, 28వ తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు (07102), కరీంనగర్- కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్ (07104), 23న నాందేడ్- తిరుపతి (07105), 24న తిరుపతి- నాందేడ్ (07106), 24, 26, 28, 29వ తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి (07107), తిరుపతి- కాకినాడ టౌన్ (07108) 24, 25, 26వ తేదీల్లో కాచిగూడ- కర్నూల్ సిటీ (07109), కర్నూల్ సిటీ- కాచిగూడ (07110), 24, 25, 26, 27వ తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28వ తేదీల్లో కర్నూల్ సిటీ- హుబ్లీ (07316) ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

## రైల్వే 4 లైన్‌ల ట్రాక్ కోసం స్థల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య నాలుగు లైన్‌లుగా విస్తరించే పనులు చేపట్టడానికి అవసరమైన స్థలాన్ని సేకరించే పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. ప్రధానంగా సనత్‌నగర్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య సుమారు 173.18 కిమీ దూరం భవిష్యత్ అవసరాలకు మూడు నుంచి నాలుగు లైన్‌ల ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టడానికి అనుమతించింది. ఈ మేరకు తెలంగాణ లోని హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని కలబురిగి జిల్లాల్లో ప్రతిపాదించిన భూమిని ఆయా జిల్లా కలెక్టర్‌ల సహకారంతో సేకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.